క్లుప్తంగా

సికింద్రాబాద్‌లో దారి దోపిడీ

పోలీసుల అదుపులో ఐదుగురు

సాక్షి, సిటీబ్యూరో: విధులు ముగించుకుని ఇంటికెళ్తున్న వ్యక్తిపై దాడి చేసి డబ్బులు, ఫోన్ దోచుకున్న ఘటన సికింద్రాబాద్‌లోని గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సాదిఖ్ ఖాన్ నగరానికి వచ్చి క్యాటరింగ్ వర్కర్‌గా పని చేస్తూ ఉప్పుగూడలో నివసిస్తున్నాడు. గురువారం రాత్రి పని పూర్తి చేసుకుని ఇంటికెళ్తున్న క్రమంలో సికింద్రాబాద్‌లోని వైఎంసీఏ సమీపంలో నలుగురు వ్యక్తులు పదునైన ఆయుధంతో దాడి చేయగా సాదిఖ్ తల, మెడపై తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. బాధితుడి వద్ద ఉన్న జీతం డబ్బు రూ.18 వేలతో పాటు ఫోన్ తీసుకుని పారిపోయారు. తీవ్రగాయాలతో ఉన్న బాధితుడు జేబీఎస్ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల వద్దకు వెళ్లి విషయం చెప్పడంతో గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీ కెమెరాలు, పరిశీలించి రసూల్‌పురకు చెందిన చింటు, ధన్‌రాజ్, విక్రమ్, అర్మాన్, శివలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేడు 'డబుల్' ఇళ్లకై ధర్నా

అడ్డగుట్ట: ఇళ్లు లేని పేదలకు వెంటనే డబుల్ బెడ్రూమ్ లేదా ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు ఎం.అజయ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అడ్డగుట్టలోని అంజయ్య విగ్రహం వద్ద ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఆసియాలోనే అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్టలో ప్రజా సంఘాల నాయకులు ఇంటింటికి వెళ్లి నాలుగు రోజులుగా సర్వే నిర్వహించారన్నారు. ఇళ్లు లేని పేదవారు వేల సంఖ్యలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అద్దెలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గోపాల్, అంజమ్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

దర్శకులు విశ్వనాథ్ మృతి తీరని లోటు

బౌద్ధనగర్: సంప్రదాయానికి పెద్దపీట వేసిన దర్శకులు కళాతపస్వి విశ్వనాథ్ మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని జబర్దస్త్ నటుడు, వల్లారపు శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు చలన చిత్రసీమలో సౌండ్ ఇంజినీర్ కాశీనాథుని విశ్వనాథ్‌గా అడుగుపెట్టి దర్శకుడయ్యారన్నారు. కేవలం దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా తమదైన శైలిలో ముద్ర వేసుకున్నారన్నారు. కళా తపస్విగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.

ఓయూకు ప్రత్యేకంగా నిధులు కేటాయించండి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థుల ఎజెండా అమలుకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఓయూ విద్యార్థుల ఎజెండాను వివరించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రావు, సుమంత్, స్వాతి, వెంకటేష్, భువన, ప్రశాంత్ పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన

రసూల్‌పురా: ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలగిరిలోని సికింద్రాబాద్ మిలిటరీ ఆసుపత్రిలో శుక్రవారం కల్నల్ నిఖత్ జహాన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించి కేన్సర్ నివారణపై అవగాహన కలిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అదే విధంగా ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో లెఫ్టినెంట్ కల్నల్ శ్వేతా ప్రసాద్ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ మిలిటరీ హాస్పిటల్ విద్యార్థుల ఆధ్వర్యంలో కేన్సర్ నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మిలటరీ హాస్పిటల్ కమాండెంట్ బ్రిగేడియర్ సంజయ్‌సింగ్ కేన్సర్ లక్షణాలు, నివారణ చికిత్సపై వివరించారు.

బాలిక అదృశ్యం

కంటోన్మెంట్: మిత్రుడి వద్ద అప్పు చేసిన విషయంలో తల్లి నిలదీయడంతో ఓ అమ్మాయి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి పరిధిలో నివాసముండే దుర్గాలక్ష్మి (19), పక్కింట్లో ఉండే మిత్రుడి వద్ద రూ.6 వేలు అప్పు తీసుకుని మరో మిత్రుడికి ఇచ్చింది. గురువారం దుర్గాలక్ష్మికి ఫోన్ చేసి డబ్బులు అడిగాడు. విషయం తెలుసుకున్న తల్లి అప్పు విషయమై అడిగి నిలదీసింది. కాసేపటి తర్వాత దుకాణానికి అని బయటకు వెళ్లిన దుర్గాలక్ష్మి ఎంతకీ రాకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇలా అడిగారు.. అలా మంజూరు!

- మా బస్తీకి దవాఖానా కావాలని డీఎంహెచ్‌ఓకు టీఎస్-ఎంఎస్ఐడీసీ చైర్మన్ విజ్ఞప్తి
- వెంటనే మంజూరు చేసిన అధికారులు



అద్దాలు అందజేస్తున్న డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, చిత్రంలో డీఎంహెచ్‌ఓ

కంటోన్మెంట్: 'నేను ఈ బస్తీలో పెరిగిన వాడినే.. మా బస్తీకి ఓ దవాఖానా మంజూరు చేయండి' అంటూ ఏకంగా తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్-ఎంఎస్ఐడీసీ) చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటిని కోరిన వెంటనే బస్తీ దవాఖానా మంజూరు చేయడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

- కంటోన్మెంట్ ఐదో వార్డు సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమానికి టీఎస్-ఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కంటోన్మెంట్ పరిధిలోని సంజీవయ్యనగర్, వాల్మీకీ నగర్, మహాత్మా గాంధీ నగర్ పరిసరాల్లో పీహెచ్‌సీ కానీ, బస్తీ దవాఖానా కానీ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాను టీఎస్-ఎంఎస్ఐడీసీ చైర్మన్ అయినప్పటి నుంచీ బస్తీ వాసుల తరఫున పదేపదే ఇక్కడ బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని సూచిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో బస్తీ వాసుల సమక్షంలోనే మరోసారి కోరుతున్నా అని వైద్యారోగ్య శాఖాధికారి వెంకటిని కోరిన వెంటనే ఆయన నూతన బస్తీ దవాఖానా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

కంటోన్మెంట్ సహకారం లేదు..

- వైద్య, ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకుంటున్నా కంటోన్మెంట్ అధికారుల సహకార లేమితో ఇక్కడ వెనుకబాటు ఉండటం శోచనీయమని శ్రీనివాస్ అన్నారు. నగరంలో 281 బస్తీ దవాఖానాలు ఉండగా, కంటోన్మెంట్‌లో మాత్రం రెండే ఉన్నాయన్నారు. తాను పట్టుబట్టి ఎనిమిది దవాఖానాలు మంజూరు చేయించానని తగిన స్థలం ఉంటే మరిన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇక కంటోన్మెంట్‌లో 2018కి ముందు ఒకే యూపీహెచ్‌సీ ఉండేదని, ప్రస్తుతం నాలుగు ఉన్నాయన్నారు. రెండు నెలల్లోనే రసూల్‌పురా, బాలంరాయి ప్రాంతాల్లో మరో రెండు యూపీహెచ్‌సీలు ఏర్పాటవుతాయన్నారు.

50 లక్షల కళ్లద్దాల అందజేత..

- కంటి వెలుగు రెండో విడతలో భాగంగా 50 లక్షల మందికి కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందని డీఎంహెచ్‌ఓ వెంకటి తెలిపారు. కంటోన్మెంట్‌లో ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో 1416 మందికి ఆపరేషన్‌లు అవసరం ఉందని త్వరలోనే వారికి నిర్వహిస్తామన్నారు. ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రాజకుమారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విశాల్, డాక్టర్ లక్ష్మి, సంజీవయ్య కొంపల్లి దాసు, బస్తీ వాసులు నర్సింగ్, అనిల్, శివ, రవి, సుధాకర్, మహంకాళీ శర్వేన్ పాల్గొన్నారు.

వృద్ధుడిని చేరదీసి.. కుటుంబీకులకు అప్పగించి



సుబ్బరాజును అప్పగించిన రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: ఇంట్లో చెప్పకుండా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఓ వృద్ధుడిని చేరదీసిన సికింద్రాబాద్ రైల్వేపోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏపీ రాష్ట్రం పాలకొల్లుకు చెందిన బి.సుబ్బరాజు (90) వ్యక్తిగత కారణాలతో కుటుంబ సభ్యులకు చెప్పకుండా నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలెక్కి సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ సుబ్బరాజు కనిపించకుండా పోయాడన్న సమాచారం పోలీసులకు ఉండడం, స్టేషన్‌లో అతనొక్కడే అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు వివరాలు తెలుసుకున్నారు. వారి మనవళ్లు ప్రవీణ్‌కుమార్, నవీన్ కుమార్‌ను శుక్రవారం నగరానికి రప్పించి సుబ్బరాజును అప్పగించారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

న్యూబోయిగూడ పాఠశాలలో బాలోత్సవం

పద్మారావునగర్: పేద విద్యార్థుల విద్య, వికాసానికి చేయూతనిచ్చి ప్రోత్సహించాలని పలువురు వక్తలు కోరారు. న్యూబోయిగూడ ప్రభుత్వ పాఠశాలలో బాలోత్సవం నిర్వహించి విద్యార్థులకు పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. బాలల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. సోమయ్య, భూపతి, భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధి రమేష్, సతీష్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ పాల్గొని మాట్లాడారు. విద్యతో పాటు ఇతరత్రా అవకాశాలు లేక పేదలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. పేద కుటుంబాలకు చెందిన ప్రతి విద్యార్థి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆర్థిక సమస్యలతో అనేక కుటుంబాలు తమ పిల్లలను పనులకు పంపించడం సమాజానికి మంచిది కాదన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభ, మహేందర్, రాకేష్, మహేష్, ఉత్తమ్, జగదీష్, సుమన్, మల్లేష్ పాల్గొన్నారు.

8న హెచ్ఐసీసీలో 'హైసియా' వార్షిక సమ్మిట్



వివరాలు వెల్లడిస్తున్న మనీషా సాబూ

సనత్‌నగర్: హైసియా (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) తన ప్రతిష్టాత్మక వార్షిక సమ్మిట్ అండ్ అవార్డ్స్-2023ను ఈ నెల 8న హెచ్ఐసీసీ హోటల్‌లో నిర్వహించనున్నారు. ఎస్టీపీఐ భాగస్వామ్యంతో జరిగే ఈ సమ్మిట్ వివరాలను శుక్రవారం అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హైసియా అధ్యక్షురాలు మనీషా సాబూ వెల్లడించారు. మూడు దశాబ్దాలకు పైగా సృజనాత్మకత, అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పరిశ్రమ, వ్యాపార, పర్యావరణ వ్యవస్థలను ప్రభావితం చేసేలా ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. 100 మందికి పైగా ఐటీ దిగ్గజాలతో సహా 500 మందికి పైగా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. అలాగే 2021-22 సంవత్సరానికి ఎగుమతులు, ఉత్పాదకత, ఉత్పత్తి అభివృద్ధిలో విజయాలు సాధించిన ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు, స్టార్టప్‌లను గౌరవించేలా అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఈ ఏడాది హైసియా జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆర్.చంద్రశేఖర్‌కు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆయన విశ్రాంత ఐఏఎస్, సెంటర్ ఫర్ ది డిజిటల్ ఫ్యూచర్ చైర్మన్, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు, టెలికం కమిషన్ మాజీ చైర్మన్, భారత ప్రభుత్వంలోని టెలి కమ్యూనికేషన్ విభాగం కార్యదర్శి, తదితర రంగాల్లో విశేష సేవలందించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది 'రీ-ఇమాజిన్, రీ-థింక్ అండ్ రీ బిల్డ్ ది ఫ్యూచర్' అనే థీమ్‌ను ఎంపిక చేసుకోవడం జరిగిందని, ఆ మేరకు హైసియా ముందుకుసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రశాంత్ నాదెళ్ల, ఎస్టీపీఐ డైరెక్టర్ సీవీడీ రామ్‌ప్రసాద్, రామకృష్ణ, సాయిప్రశాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సనత్‌నగర్: చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని ట్రాఫిక్ ఎస్సై జ్యోతి పేర్కొన్నారు. బేగంపేటలోని హీరో ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కులో శుక్రవారం కూకట్‌పల్లి గీతాంజలి పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు సూచన మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి ట్రాఫిక్ నియమాలు, నిబంధనల గురించి వివరించారు. ముఖ్యంగా జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డును దాటాలని కదులుతున్న బస్సుల్లో ఎక్కడం, దిగడం చేయరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవడమే కాకుండా తాము పాటిస్తూ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది రాజేష్, సుమన్‌కుమార్, చక్రధర్, శ్రావణ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎస్సై జ్యోతి

శంకర్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: తత్వశాస్త్రంలో తెలంగాణ శంకర్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఆర్ట్స్ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.జి లక్ష్మణ్ పర్యవేక్షణలో రిలీజియన్ అండ్ సైన్స్ ఎ స్టడీ ఇన్ కాంపెరిజన్ అండ్ కాన్‌ట్రాస్ట్ అనే అంశం పై పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. నిజామాబాద్ జిల్లా, రెంజిల్ మండలం, తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన శంకర్ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినందున ఆయనను తెలంగాణ శంకర్‌గా పిలుస్తున్నారు.

సెలూన్ ప్రారంభం

రసూల్‌పురా: సికింద్రాబాద్ సైనిక్‌పురిలో ఇంటర్నేషనల్ జ్యూసి సెలూన్‌ను యువ మహిళా పారిశ్రామిక వేత్తలు వైష్ణవిరెడ్డి, శ్రావ్యరెడ్డి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఆర్కిటెక్, ఎంబీఏ పూర్తి చేసి ఫ్యాషన్‌పై ఇష్టంతో నలుగురికి ఉపాధి కల్పించాలనే మంచి ఆలోచనతో ఈ సెలూన్ ప్రారంభించినట్లు వెల్లడించారు. ఫ్యాషన్‌లో అందం కూడా ఓ భాగమన్నారు.

తార్నాక సీపీఐలో కలకలం

లాలాపేట: తార్నాక డివిజన్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(సీపీఐ)లో కలకలం రేగింది. గత ఏడేళ్ల నుంచి తార్నాక డివిజన్ కార్యదర్శితో పాటు మిగతా కమిటీ కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల కొత్తగా వచ్చిన ఓ నాయకుడు నియోజకవర్గ కన్వీనర్‌గా చలామణి అవుతూ పాత కమిటీని ఏమాత్రం సంప్రదించకుండానే ఇటీవల తార్నాక డివిజన్ సీపీఐ నూతన కమిటీని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పటికే కార్యదర్శిగా కొనసాగుతున్న వారికి ఈ విషయం తెలిసి కంగుతినే పరిస్థితి వచ్చిందని ఆ నేత విలేకరులతో వాపోయారు. పేద ప్రజల పక్షాన పోరాటాలు చేసే కమ్యూనిస్టు పార్టీలో గత కొన్ని ఏళ్ల నుంచి పార్టీకి సేవలందిస్తున్నా తమ సేవలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఇటీవల నాయకత్వంలోకి వచ్చిన కొత్త నేతలు నూతన పోకడలతో పార్టీ సిద్ధాంతాలకు తిలోదాకాలు ఇచ్చారని పేర్కొంటున్నారు. తమకు సమాచారం లేకుండా సమావేశం ఎలా పెడతారని దీనిపై జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్తే ఏలాంటి స్పందన లేదన్నారు. ఈ విషయాన్ని త్వరలోనే పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రైలులో నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలులో నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం. సంజీవయ్య పార్క్-జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ల మార్గ మధ్యలో శుక్రవారం ఉదయం రైలులో నుంచి ఓ వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు వయస్సు 30-35 ఏళ్ల మధ్య ఉంటుందని తెలుపు రంగు ఫుల్‌షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల జీవితాల్లో వెలుగులు



ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎందరో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. అమీర్‌పేట డివిజన్ బల్కంపేటకు చెందిన నరేష్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంత్రి అందజేశారు. నరేష్ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్సకు అవసరమైన సహాయం కోసం మాజీ కార్పొరేటర్ శేషుకుమారి సహకారంతో మంత్రిని కలిసి విన్నవించారు. మంత్రి చొరవతో రూ.2.50 లక్షలు మంజూరు కాగా శుక్రవారం ఎల్‌ఓసీ పత్రాలను ఆయన తల్లి లక్ష్మమ్మ, భార్య రేఖకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

సనత్‌నగర్: డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత సిరాజుద్దీన్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిరాజ్ వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను మంత్రి ఆదేశించారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

సనత్‌నగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో చికిత్స పొందుతుండగా గుండెపోటుకు గురై వృద్ధుడు మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గత నెల 13న టీవోలి గార్డెన్ వద్ద ఓ వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడటంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా కార్డియోపల్మోనరీ అరెస్టుతో ఈ నెల 1న మృతి చెందాడు.

'నీట్'లో విజయానికి కేవైఎన్ దోహదం



సనత్‌నగర్: నీట్ అభ్యర్థుల కోసం మొట్టమొదటిసారిగా వినూత్నమైన సెల్ఫ్ ఇవాల్యుయేషన్ టూల్ 'నో యువర్ ఎన్‌సీఈఆర్‌టీ' (కేవైఎన్)ను ఆకాష్ బైజూస్ ఆవిష్కరించింది. ఎస్ఆర్‌నగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేవైఎన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అకాడమిక్ ఆపరేషన్ అండ్ ఎక్స్‌లెన్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ ఏరియా బిజినెస్ హెడ్ భరత్‌కుమార్‌యాదవ్ మాట్లాడారు. నీట్‌లో విజయానికి కేవైఎన్ సంజీవనిగా నిలుస్తోందన్నారు. నో యువర్ ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలను లోతుగా అర్థం చేసుకోవడంతో పాటు నీట్‌లో అత్యధికంగా స్కోరింగ్ చేయడానికి సహాయపడుతుందన్నారు. నీట్ విధానానికి అనుగుణంగా రూపొందించిన కేవైఎన్‌ను అనుసరించడం ద్వారా వేగవంతంగా ఖచ్చితత్వమైన సమాధానాలను ఇవ్వగలుగుతారన్నారు.

పీహెచ్‌డీ అభ్యర్థులకు ఆర్.కృష్ణయ్య మద్దతు



కృష్ణయ్యతో సమావేశమైన విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ అభ్యర్థుల పోరాటానికి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మద్దతు ప్రకటించారు. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం విద్యనగర్‌లోని కృష్ణయ్య కార్యాలయానికి వెళ్లి కలిశారు. ఓయూ విద్యార్థులు చెప్పిన విషయాలను విన్న ఆయన వారి పోరాటానికి మద్దతు తెలిపారు. నేడు (4న) ఆర్ట్స్ కాలేజీలోని పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్ సెమినార్ హాల్లో పీహెచ్‌డీ అర్హత మార్కులు-ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయం అనే అంశం పై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. చర్చలో ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు, యూజీసీ డీన్ ప్రొ.మల్లేష్, టీజేఎస్ నేత ప్రొ.పీఎల్ విశ్వేశ్వరరావు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ ప్రొ.అన్సారీ, ప్రొ.చంద్రునాయక్, ఆర్.కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ, ఎల్ఎహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బెల్లయ్య నాయక్ పాల్గొంటారని విద్యార్థి నేతలు తెలిపారు.

రామాలయ అభివృద్ధికి ఎస్‌జీఎఫ్ చేయూత

కంటోన్మెంట్: దేవాలయాల అభివృద్ధితో సమాజంలో ఆధ్యాత్మికత పెరిగి శుభం కలుగుతుందని శ్రీగణేశ్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) చైర్మన్ శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు సంజీవయ్యనగర్ వీకర్ సెక్షన్‌లో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటుకు అవసరమైన సహకారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీవాసులు కోరిన వెంటనే తాను గ్రానైట్ పంపినట్లు తెలిపారు. బస్తీల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాలూ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, సంతోష్, శ్రీనివాస్, ప్రమోద్, రాజు, సంపత్, మల్లేశ్, అనూప్, శేఖర్ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్యహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ పరిధిలో జరిగింది. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సీతాఫల్‌మండి-సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 55 సంవత్సరాలు ఉన్న ఓ వ్యక్తి ఆత్యహత్య చేసుకున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి పరిశీలించగా ఎలాంటి వివరాలు లభించలేదు. ఉద్దేశపూర్వకంగానే రైలు కింద తలపెట్టి ఆత్యహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు చొక్కా, బూడిదరంగు ప్యాంటు ఉన్నాయని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

ఆర్థిక ఇబ్బందులు భరించలేక..

సికింద్రాబాద్: ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ వ్యక్తి ఆత్యహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా డబీర్‌పూర్‌కు చెందిన నక్క నాగేశ్ (39) ప్రైవేట్ ఉద్యోగి. ఉద్యోగం ద్వారా వచ్చే జీతం కుటుంబ అవసరాలకు సరిపోవడం లేని కారణంతో మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం గుండ్లపోచంపల్లి-మేడ్చల్ రైల్వేస్టేషన్ల మధ్య రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.